క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ సేవలపై వినియోగదారులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డీఈఈ నరసింహారావు

అమలాపురం టౌన్: స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. బీఎస్ఎన్ఎల్ డీఈఈ పీఎస్ఎల్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలు, పథకాలు గురించి వివరించారు. డివిజన్ వ్యాప్తంగా 42 మంది వినియోగదారులు సదస్సుకు హాజరై సేవల పరంగా తమకున్న సందేహాలను అధికారులు ముందు ఉంచి నివృత్తి చేసుకున్నారు. పలువురు వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. సదస్సులో బీఎస్ఎన్ఎల్ ఎస్డీఈలు వై. వెంకటేశ్వరరావు, ప్రసాద్, జేటీఓలు హనుమంతరావు, రాజేంద్ర, శ్రీనివాస్‌లు ప్రసంగించి సంస్థ సేవలు, పథకాలను వివరించారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో భవిత చిత్తు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రశాంత్

అల్లవరం: విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ సూచించారు. మండంలలోని గుడ్డివానిచింత వద్ద రవితేజ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, రహదారి భద్రతపై ఎస్ఐ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. రహదారి నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని ప్రమాదాల అదుపులో పాత్రధారులు కావాలని కోరారు.

రోడ్డుపై శయనం.. ట్రాఫిక్‌కు అంతరాయం



మద్యం మత్తులో రోడ్డుపై పడుకున్న వ్యక్తి

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెనపై అమలాపురం రూరల్ మండలం పేరూరుకు చెందిన ఓ వక్తి రోడ్డుపై పడుకొని హడావుడి చేశాడు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండడంతో పాటు తాను వేసుకున్న చొక్కా సైతం తీసివేసి ఎండలో రోడ్డుపై పడుకొని నిరసన తెలిపాడు. తన అన్నదమ్ములు ఆస్తికి సంబంధించి పంపకాలు చేయడం లేదని, తనకు న్యాయం చేయాలని నినాదాలు చేశాడు. నడి రోడ్డుపై పడుకుని హల్‌చల్ చేయడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రసాదరావు మృతి



గొల్లవిల్లిలో వర ప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలోని చిక్కం సత్తిరాజు అన్నదాన సత్రం, ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, గొల్లవిల్లి సీఎస్ఎం జూనియర్, ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ చిక్కం వీర వెంకట సత్య వర ప్రసాదరావు(64) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని కళాశాలల ప్రాంగణంలో ఉంచి కళాశాలల పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాలల ప్రిన్సిపల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ తోకల దుర్గా ఈశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మోటారు సైకిల్ చోరీ

అమలాపురం టౌన్: స్థానిక దేవాంగ వీధిలోని డీలక్స్ హోటల్ సమీపంలో మంగళవారం పట్టపగలే ఓ మోటారు సైకిల్ చోరీకి గురైంది. ఆ వీధిలో మోటారు సైకిల్ మెకానిక్ సూరిబాబుకు చెందిన మోటారు సైకిల్‌ను దొంగ దర్జాగా వేసుకుని వెళుతున్న దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పట్టణ ఎస్సై కిషోర్‌బాబును ఈ చోరీపై వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

చేనేతకు ఏదీ చేయూత..!

- విద్యుత్ మగ్గాలకు ప్రోత్సాహంతో చేనేతలకు గడ్డు కాలం
- ఇంటిల్లిపాదీ కష్టించినా రోజుకు రూ.500 దాటని ఆదాయం
- వైఎస్సార్ సీపీ పాలనలో ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం
- ఆరు నెలలు దాటినా నేటికీ అందని పరిహారం
- సాయం కోసం నేతన్నల ఎదురుచూపు



మగ్గంపై నేత పనిలో నిమగ్నమైన దంపతులు

తాళ్లరేవు: రెడీమేడ్ దుస్తుల రాకతో చేనేత పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. పరిశ్రమలో విద్యుత్ మగ్గాల ప్రోత్సాహంతో చేనేత కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఇంటిల్లిపాది రోజంతా కష్టబడ్డా రూ.500 కూడా ఆదాయం దాటని దైన్య స్థితి దాపురించింది. దీంతో కార్మికులు చేనేత పరిశ్రమకు దూరమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేనేతల దయనీయ పరిస్థితిని గుర్తించిన అప్పటి సీఎం వైఎస్ జగన్ వారికి ఆర్థిక సహాయాన్ని అందించడంతో చేనేతకు దూరమైన కార్మికులు తిరిగి పరిశ్రమ వైపు మళ్లారు. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం చేనేతల కష్టాలను పట్టించుకోకపోవడం మానేసింది. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా ఒక్క రూపాయి పరిహారాన్ని కూడా ఇవ్వక పోవడంతో చేనేత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేతన్న నేస్తం కొనసాగేనా..!

చేనేతల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అందించిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం వారి జీవితాలకు కొండంత అండగా ఉండేది. ఈ పథకం కోసం నేత కార్మికులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.24 వేల చొప్పున వారి ఖాతాలలో ప్రభుత్వం ఏటా జమ చేసేది. ఒక్కొక్క చేనేత కార్మికునికి గడచిన ఐదేళ్లలో రూ.లక్షకు పైగా లబ్ధి చేకూరింది. అయితే కూటమి ప్రభుత్వం ఆ పథకం ఊసే ఎత్తక పోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

సంక్రాంతికి అందని ఆర్డర్లు

ప్రతి ఏటా సంక్రాంతికి మూడు నెలల ముందు మాస్టర్ వీవర్స్ నుంచి పెద్ద మొత్తంలో ఆర్డర్లు వచ్చేవని ఈ ఏడాది ఆ ఆర్డర్లు ఊహించిన స్థాయిలో రాకపోవడంతో చేసేందుకు పని లేకుండా పోయిందని చేనేతలు వాపోతున్నారు. తమకు ఈ పనితప్ప మరోపని తెలియదని, ప్రభుత్వం సహాయం అందించకుంటే వలస పోవడం తప్ప వేరే మార్గం లేదంటున్నారు. గతంలో చేనేత సహకార సంఘాల సభ్యులకు ఆప్కో ద్వారా ఉన్న బకాయిలను ప్రభుత్వం పలు దఫాలుగా విడుదల చేసి చేయూతగా నిలిచిందన్నారు. ప్రస్తుతం బకాయిలు కూడా చెల్లించే పరిస్థితి లేదని పలువురు వాపోతున్నారు. తమ సమస్యలను పరిష్కరించడంతో పాటు చేయూతను అందించి చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం కొనసాగించాలి



గత కొన్ని నెలలుగా పూర్తి స్థాయిలో పనుల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. రోజుకు సుమారు 14 గంటలు కష్టపడ్డా రూ.500 కూడా ఆదాయం దాటడం లేదు. పనుల్లేక పస్తులున్న రోజులు ఉన్నాయి. ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని అందించి ఆదుకోవాలి. గతంలో మాదిరిగా ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించాలి. ప్రతి రోజూ పనులు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

నూలు వీర వెంకట సత్యనారాయణ, చేనేత కార్మికుడు.

జీఎస్టీ తొలగిస్తే పూర్వ వైభవం



చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించడంతో లాభాల్లో కోత పడుతోంది. గతంలో నూలుపై సబ్సిడీ, పావలా వడ్డీకే రుణాలు తదితర పథకాలు ఉండేవి. వాటిని గత ప్రభుత్వాలు రద్దు చేయడంతో ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. వాటిని పునరుద్ధరించడంతో పాటు జీఎస్టీని తొలగిస్తే చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం వస్తుంది.

ముద్దన వెంకట శివరామ ప్రసాద్, చేనేత సంఘం నాయకులు, ఇంజరం గ్రామ సర్పంచ్.

ప్రభుత్వం స్పందించాలి



విద్యుత్ మగ్గాలు, రెడీమేడ్ వస్త్రాల ప్రభావంతో చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నేత కార్మికుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసేది. అయితే ప్రస్తుతం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయక పోవడంతో నేత కార్మికులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి చేనేతలకు న్యాయం చేయాలి.

బీరక వీరభద్రరావు, చేనేత సంఘం నాయకుడు.

రక్తదాతకు సత్కారం



రక్తదాత సూర్యకుమారిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జాతీయ రక్త దాతల దినోత్సవం సందర్భంగా అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కుమ్మర్ల వీధిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మహిళా రక్తదాత గంటి సూర్యకుమారిని సత్కరించారు. మహిళలకు ఉండే వ్యక్తి గత ఇబ్బందులు, రక్త హీనత తదితర కారణాలతో సాధారణంగా రక్తదానం చేసేందుకు ముందుకు రారని వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అన్నారు. అలాంటి ఇబ్బందులను అధిగమించి సూర్యకుమారి రక్తదానాలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి, కంకటాల విజయలక్ష్మి, మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, శ్రీగిరి పద్మావతి, పేరి లలిత, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి ఆదిలక్ష్మీపురంలో రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడిమి చిన్నవరాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు పండు శ్రీను, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చొల్లంగి తీర్థం.. వైభవోపేతం!

- ముస్తాబైన సోమేశ్వర, సంగమేశ్వర ఆలయాలు
- పవిత్ర స్నానాలకు తరలి రానున్న భక్తజనం
- భారీ బందోబస్తు నడుమ విస్తృత ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబైన బాలా త్రిపుర సుందరీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కరప ఎంపీడీఓ అనుపమ

తాళ్లరేవు: అమావాస్యను పురస్కరించుకొని చొల్లంగి తీర్థానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. చొల్లంగిలోని చంద్ర ప్రతిష్ఠిత లింగమైన శ్రీ రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి, తుల్యభాగ నదీ తీరాన కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయాలను విద్యుద్దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయాలకు రంగులు వేయడంతో కళకళలాడుతున్నాయి. ఉత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను కరప ఎంపీడీఓ ఎం.అనుపమ మంగళవారం పరిశీలించారు. స్వామివారి శీఘ్ర దర్శనం కోసం ఈ ఏడాది రూ.30 క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. సంక్రాంతి తరువాత వచ్చే మాఘమాస అమావాస్య రోజున సముద్ర స్నానం చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో తెల్లవారు జామున 2 గంటల నుంచే భక్తులు పవిత్ర తుల్యభాగ నదిలో స్నానమాచరిస్తూ ఉంటారు. అమావాస్య మరుసటి రోజున సప్త సాగర యాత్ర ప్రారంభమవుతుంది.

ట్రాఫిక్ మళ్లింపు

చొల్లంగి తీర్థం నేపథ్యంలో కాకినాడ– యానాం రహదారిలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. అమలాపురం నుంచి కాకినాడ వెళ్లే బస్సులను జామకాయల తూము నుంచి గొర్రిపూడి మీదుగా కాకినాడకు, అలాగే కాకినాడ నుంచి వచ్చే బస్సులను గురజనాపల్లి మీదుగా యానాం రహదారికి మళ్లించినట్లు తెలిపారు. తీర్థానికి తరలి వచ్చే వేలాది మందికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కాకినాడ డీఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బకాయిల భారం మామూలే!

ఏళ్లుగా మున్సిపాలిటీని వేధిస్తున్న సమస్య ఇదే

అమలాపురం టౌన్: మున్సిపాలిటీకి సంబంధించి చేసిన అభివృద్ధి పనులకు కొంత మొత్తంలో చెల్లింపులు పెండింగ్‌లో ఉండడం సర్వ సాధారణం. ఏ పార్టీ హయాంలో నైనా పెండింగ్ బిల్లుల భారం మున్సిపాలిటీకి తప్పడం లేదు. అయితే ఈ కౌన్సిల్‌లో ఇప్పటికే రూ.4 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంటే మరో రూ.7 కోట్లతో 97 పనులకు ఎలా టెండర్లు పిలిచారని సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారులను ప్రశ్నించారు. పాత బకాయిలు తీర్చకుండా కొత్త పనులు ఎలా చేపడతారని, నిబంధనలకు విరుద్ధంగా సాధారణ నిధుల కేటాయింపులు, వెచ్చింపులు ఉంటున్నాయని ధ్వజమెత్తారు. ఈ తప్పిదాలపై జిల్లా కలెక్టర్‌తో విచారణ జరిపిస్తానని హెచ్చరించారు. అయితే 2014 నుంచి 2019 వరకూ టీడీపీ అధికారంలోనే ఉంది. అప్పుడు ఆనందరావు ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ హయాంలో ఏర్పడ్డ ఆ పార్టీ కౌన్సిల్‌లో అధికారం చేపట్టింది. తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ కౌన్సిల్ అధికారంలోకి వచ్చింది. టీడీపీ కౌన్సిల్ ముగిసే సరికి మున్సిపాలిటీలో అప్పటికే ఉన్న రూ.9 కోట్ల లోటు బడ్జెట్‌తో వైఎస్సార్ సీపీ కౌన్సిల్ అధికారం చేపట్టే సరికి ఆ మొత్తంతో కౌన్సిల్ మొదలైంది. ప్రస్తుత వైఎస్సార్ సీపీ కౌన్సిల్‌లో రూ.4 కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయి. దీనికి తోడు మరో రూ.7 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. అంటే రూ.11 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. గత టీడీపీ కౌన్సిల్ సమయంలో పెండింగ్ బిల్లులు, నిబంధనల ఉల్లంఘన గురించి మాట్లాడని అప్పటి ప్రజా ప్రతినిధులు ఇప్పుడు అదేదో తప్పిదం జరిగినట్లు ఆరోపణలు గుప్పిస్తున్నారు. పార్టీ ఏదైనా పెండింగ్ బిల్లులు అనేవి సర్వసాధారణం అనే విషయాన్ని నాయకులు గుర్తెరగాలి.

సీసీ కెమెరాతో చోరీ విఫలం

- జ్యూయలర్స్ షాపులో దొంగతనానికి యత్నం
- యజమాని రావడాన్ని గమనించి దొంగ పరారు



షాపులో చోరీకి ప్రయత్నిస్తున్న దొంగ

ఐ.పోలవరం: భారీగా దోచుకుందామని ఓ దొంగ చేసిన ప్రయత్నాన్ని సీసీ కెమెరా భగ్నం చేసిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే.. మురమళ్ల వీరేశ్వర స్వామి దేవస్థానం వద్ద మెయిన్ రోడ్డులో ఉన్న జ్యూయలర్స్ అండ్ బ్యాంకర్స్ షాప్‌లో ఓ దొంగ చోరీకి విఫలయత్నం చేశాడు. మంగళవారం అర్ధ రాత్రి దాటాక కట్టర్ సాయంతో షాప్ షట్టర్ తొలగించేందుకు అతడు యత్నించినట్టు షాప్ యజమాని ఎస్.బాల తెలిపారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సీసీ ఫుటేజ్ పరిశీలించగా, ఒకటి సక్రమంగా పనిచేయలేదు. అనుమానం వచ్చి ఆయన షాపు వద్దకు రావడాన్ని గమనించి.. దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని, ఆధారాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. గత నెలలో దొంగతనానికి యత్నించారని, అందుకోసమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు షాపు యజమాని తెలిపారు. ఈ ఘటనపై ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని సీఐతో పాటు, ఐ.పోలవరం ఎస్సై మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది పరిశీలించారు. మురమళ్లలో ఇదే షాపులో డిసెంబర్ 26న దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన నూలు కమల కుమారి మెడలోని బంగారు హారాన్ని దొంగిలించారు, రూ.లక్షల విలువైన హారం పోవడంతో, స్థానిక మహిళలు, గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మోటార్ సైకిళ్ల చోరీలు జరుగుతున్నా, రికవరీలో పోలీసులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

యానాం: నియోజకవర్గ పరిధిలో బైపాస్ రహదారిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. యానాం బైపాస్ రహదారి ఫుట్‌పాత్‌పై ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం లభ్యమైందని చెప్పారు. మృతదేహాన్ని యానాం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కొత్తపేట: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం 600 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. కొత్తపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గోదావరి పరీవాహక లంకలో సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం బెల్లంఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు.

వైభవంగా శ్యామలాదేవి శోభాయాత్ర



అమలాపురం పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్న అక్షయపాత్ర మహిళలు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీ ఆదిశేష నిలయంలో మంగళవారం రాత్రి నుంచి 16 రోజుల పాటు జరగనున్న శ్రీ రాజ శ్యామల అఖండ హోమ పూజా మహోత్సవాల్లో భాగంగా పుర వీధుల్లో నిర్వహించిన కలశ శోభాయాత్ర వైభవంగా జరిగింది. స్థానిక పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం నుంచి మహిళలు శిరస్సున కలశాలు ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ముమ్మిడివరం గేటు సెంటరు, మెయిన్ రోడ్డు మీదుగా విద్యుత్ నగర్‌లోని హోమ స్థలానికి ఆ కలశాలను తీసుకొచ్చారు. తొలుత సుబ్బాలమ్మ దేవతకు పూజలు చేశారు. ఆది శేష నిలయానికి కలశాలను తీసుకొని వచ్చాక లఘు సర్వతో పత్ర వేదికపై దేవతలను ప్రతిష్ఠించారు. శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ ఆధ్వర్యంలో శోభాయాత్ర సాగింది.

నలుగురు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

యానాం: యానాంలో గతంలో నిర్వహించిన రిక్రియేషన్ క్లబ్‌ల ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరులో ప్రమేయం కలిగి ఉన్నారనే అభియోగాల మేరకు యానాం మున్సిపాలిటీలో బిల్లు కలెక్టర్‌లుగా విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయాలని పుదుచ్చేరి లోకల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి సౌందిర రాజన్ ఆదేశాలు జారీ చేశారు. విక్టరీ యానాం స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ క్లబ్, గుడ్‌లక్ రిక్రియేషన్ క్లబ్ అండ్ కల్చరల్ అసోషియేషన్‌లకు ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరులో అభియోగాలు రావడంతో వీటిపై పుదుచ్చేరి మున్సిపల్ కమిషనర్ ఇటీవల విచారణ జరిపారు. విచారణ నివేదిక ఆధారంగా సదరు ఉద్యోగులు ఇదే ఘటనపై సస్పెండ్ చేయబడ్డ అప్పటి మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశానికి సహకరించారని అన్నారు. దీంతో వీరిని సస్పెండ్ చేయాలని యానాం మున్సిపాలిటీ కమిషనర్‌ను ఆదేశించారు.

కోరంగి ఫార్మసీలో ముగిసిన శిక్షణ



కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

తాళ్లరేవు: ఫార్మాసిస్టుల నైపుణ్యాలను పెంపొందించేందుకు లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా కోరింగా ఫార్మసీ కళాశాలలో స్వల్ప కాలిక నైపుణ్య శిక్షణ నిర్వహించారు. ఫార్మసీ రంగానికి సంబంధించి ఈ శిక్షణా కార్యక్రమాన్ని మొదటిగా కోరంగి కళాశాలకు కేటాయించడం పట్ల కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మొంటు పటేల్ తదితరులకు కళాశాల కరస్పాండెంట్ పి.కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణ జ్యోతి, ఏఓ మాల తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈజీపీని సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న మహిళా లబ్ధిదారు

యానాం: నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి నిమిత్తం ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్(పీఎంఈజీపీ)ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో దీనిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఆర్థిక సాధికారిత కోసం ప్రయత్నించాలని ఆ దిశగా చిన్న తరహా పరిశ్రమల స్థాపన ద్వారా వివిధ ఉత్పత్తులు తయారు చేయడానికి ప్రయత్నించాలని కోరారు. తయారీ పరిశ్రమకు రూ.50 లక్షలు, సేవా పరిశ్రమకు రూ.20 లక్షలతో పాటు మరిన్ని రుణాలు పొందవచ్చునని అధికారులు తెలిపారు.

ఓఎన్జీసీ వద్ద గ్రామస్తుల ఆందోళన

- దిగి వచ్చిన యాజమాన్యం
- డిమాండ్ల అంగీకారం



ఓఎన్జీసీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఉప్పలగుప్తం: గ్రామ సమస్యలను పరిష్కరించాలంటూ చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేట జీఎంఏఏ, ఓఎన్జీసీ ప్లాంట్ గేటు వద్ద మంగళవారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణితో పాటు గ్రామస్తులు టెంట్ వేసి వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి ఆందోళన చేపట్టారు. ప్లాంట్ కార్యకలాపాలు జరగకుండా అడ్డుకున్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన నిర్వహించగా విషయం తెలుసుకున్న ఓఎన్జీసీ అధికారులు ఆందోళన కారుల వద్దకు వచ్చి చర్చలు జరిపారు. సీనియర్ దళిత నాయకుడు ఇసుకపట్ల రఘు బాబు, గ్రామ పెద్దలు డిమాండ్లను ఓఎన్జీసీ ఏరియా మేనేజర్ రవిశంకర్, ఐఎం రామచంద్రుడు, సీఎస్ఆర్ మేనేజర్ శ్యామ్‌లకు తెలిపారు. గ్రామంలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు, ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు పెంచేందుకు, కాలనీలో డ్రైనేజీపై సిమెంట్ బల్లలు వేసేందుకు, గ్రామంలో 18 సోలార్ లైట్లు వేసేందుకు, మిగిలిన ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వడంతో పాటు డ్రైవర్ పోస్టులు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. చర్చల్లో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, సీనియర్ దళిత నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు, పీడీయూఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పంచాయతీ వార్డు సభ్యులు సాకా దుర్గా సూరిబాబు, గ్రామ పెద్దలు సాకా బాలరాజు, నేరేడుమిల్లి సత్యనారాయణ, మాదే పెద్దిరాజు, గెద్దం లక్ష్మణరావు, మోర్తా కృష్ణ, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, ఏడిద శ్రీను, తదితరులు పాల్గొన్నారు.